క్లుప్తంగా

నీట మునిగిన వీధులు



కాలువ ద్వారా ఇళ్ల మధ్యకు చేరిన నీరు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అరవపల్లి ఆర్ అండ్ బీ బంగ్లా వెనుక వైపు ఉన్న పలు వీధులు నీట మునిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బహుదా నది నుంచి కన్యకా చెరువుకు నీటిని తరలించే ప్రధాన కాలువ ద్వారా చెరువుకు నీటిని తరలిస్తున్నారు. గత పది రోజులుగా తరలిస్తున్న నీటి కంటే ఆదివారం కొంత ఎక్కువగా వదిలారు. దీనివల్ల కాలువలోని పలుచోట్ల ఉన్న లీకేజీల ద్వారా నీరు వీధుల్లోకి వచ్చేసింది. దీంతో పలు రకాల విష సర్పాలు వీధుల్లోకి రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో పాటు వీధిలో క్రమంగా నీరు పెరుగుతోంది. ఇందువల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే ఈ కాలువ ద్వారా వస్తున్న నీటితో ఆర్‌యూబీ మునిగి నాగిరెడ్డిపల్లె, అరవపల్లె గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధుల్లోకి వస్తున్న నీటిపై చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

గురువులకు సత్కారం



విశ్రాంత ఉపాధ్యాయుడు వి.సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న డైట్ లెక్చరర్, డిప్యూటీ తహసీల్దార్

సంబేపల్లి : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సంబేపల్లె మండలంలో పలువురు విశ్రాంత ఉపాధ్యాలయులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని పాన్నేళ వాండ్లపల్లె నివాసి, డైట్ లెక్చరర్ వై.సి రెడ్డెప్ప రెడ్డి, పి.ఎస్‌కాలనీ గ్రామం గొల్లపల్లెకు చెంది ప్రస్తుతం వీరబల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వరగంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో విశ్రాంత హిందీ పండిట్ వరగంరెడ్డి సుబ్బారెడ్డి, చెంచురెడ్డిగారిపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యర్రపురెడ్డి సుబ్బారెడ్డిలను సన్మానించారు.

గాలివీటి విజయభాస్కర్‌రెడ్డికి అభినందనలు



విజయభాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

వీరబల్లి : వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించారు. దీంతో ఆదివారం పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పరామర్శ



వెంకటరామిరెడ్డి మనువడిని పరామర్శిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కాలాడివాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్రామిరెడ్డి మనువడికి ప్రమాదం జరిగిన తీరుపై ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాపత్తిన రెడ్డయ్యలు ఆరా తీశారు. అలాగే అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రేమానంద రెడ్డితోపాటు మైనార్టీ నాయకుడు రఫీ సతీమణి పిర్దోస్‌ను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకట నారాయణ రెడ్డి, కాళాడి జనార్దన్ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, గడ్డం జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చాన్ బాషా పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



జేఎంజే కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ

సిద్దవటం : కడప-చెన్నై జాతీయ రహదారి జేఎంజే కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి ఎస్ఐ మహమ్మద్‌రఫీ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు ప్రమాదాలను అరికట్టేందుకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, పరిమితి మించి ఓవర్ స్పీడ్ వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తప్పనిసరిగా లైసెన్స్, వాహనపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, స్థానిక పోలీసులు తెలిపారు.

ధర్నాతో ప్రభుత్వ కళ్లు తెరిపిద్దాం

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

రాయచోటి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఫ్యాప్టో ధర్నాతో కళ్లు తెరిపిద్దామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలు పిలుపునిచ్చారు. రాయచోటిలోని డైట్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు ఎ.శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి అన్యాయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు నెరవేరుతాయని, పెట్టుకున్న ఆశలు అడియాశలు అయ్యాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం కావస్తున్నా కనీస స్పందన కరువైందన్నారు. 12వ పీఆర్సీ గడువు దాటి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా పీఆర్సీ కమిటీ వైపుగా చర్యలు లేవన్నారు. తక్షణం 12వ ఆర్సీని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాల్సిన డీఏలు సైతం అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు ఉద్యోగుల పాలిట ఉరి తాడులా పరిణమించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి హైస్కూల్ ప్లస్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. సమగ్ర శిక్ష ద్వారా వేతనాలు పొందుతున్న కేజీబీవీ సిబ్బంది, ఎంఈఓ ఆఫీసు సిబ్బంది, సీఆర్పీలు తదితర కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. గురుకులాలు, సొసైటీలలో పనిచేస్తున్న వారికి పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ సమస్యల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో అక్టోబర్ 7వ తేదీ విజయవాడలో జరగబోయే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి మధుసూదన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమాజంలో శాంతి కుసుమాలు

ఎమ్మెల్యే ఆకేపాటి



విజిట్ అవర్ మస్జీద్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు అన్నదమ్ముల్లా ఐక్యతతో కలిసి మెలసి జీవించినప్పుడే సమాజంలో శాంతి కుసుమాలు విరాజిల్లగలవని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. విజిట్ అవర్ మస్జీద్ కార్యక్రమంలో భాగంగా ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆదివారం పట్టణంలోని ఎర్రబల్లి మస్జీద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశమని, ఇక్కడి ప్రజలందరు అనాదిగా సోదరభావంతో జీవిస్తుండటం ఆనందదాయకమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో మరింత ఐక్యత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణగుప్త, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ జాహీద్ అలీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు మిర్యాల సురేఖ, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కరాటే విద్యార్థులు

నందలూరు : చెన్నైలోని సెంబాకం ఎస్‌బీవీఈటీ కాలేజీలో వరల్డ్ కరాటే మాస్టర్ అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమంలో మండలంలోని విస్‌డం స్కూల్ కరాటే విద్యార్థులు పాల్గొన్నారని కరాటే మాస్టర్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 1500 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ పాఠశాల నుంచి మనోజ్ఞ సాయి, నివేదిత, మోక్షిత్, నిర్వాన్‌నందన్, సమీనా, తసీఫా, సాదిక్, మౌలి, నిత్యశ్రీ, గోపీచంద్ పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారన్నారు. విస్‌డం స్కూల్ కరెస్పాండెంట్ వలిమి రాధ విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

రాయచోటి : సుదీర్ఘకాలం పాటు విద్యారంగానికి ఉపాధ్యాయులు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని డైట్‌లో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎస్టీయు ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన, ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సన్మాన సభను ఏర్పాటు చేశారు. భావి భారతావనికి ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయులు దీపపు స్తంభం లాంటి వారని వారు అభివర్ణించారు.

65 మంది ఉపాధ్యాయులకు సన్మానం..

రాయచోటి రీజన్‌లో పదవీ విరమణ పొందిన జాతీయ, రాష్ట్ర అవార్డు పొందిన దాదాపు 65 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డీసీబీఈ సెక్రటరీ నాగముని రెడ్డి, హెచ్ఎంఎస్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంటు సుబ్రమణ్యం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగారెడ్డి, కడియాల మురళీ, ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, సీనియర్ నాయకుడు వై రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం సృష్టికర్తలు బాబు అండ్ కో

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో గ్రామ గ్రామాన ఏరులై పారుతున్న నకిలీ మద్యానికి సృష్టికర్తలు సీఎం చంద్రబాబు అతని అనుచరులేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి దుయ్యబట్టారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఖాజామొహిద్దీన్, నియోజకవర్గ ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు జీవీ సుబ్బరాజు, మండల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు గంగా కళ్యాణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి విశ్వనాథరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెండుకు మించి బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకొని అధికారికంగా మద్యం విక్రయిస్తున్నారని మండి పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో రోజుకు రూ.30లక్షల విలువ చేసే మద్యం అక్రమంగా తయారు చేస్తుంటే అధికారులు నిద్రమత్తులో ఉన్నారా లేక ముడుపుల మాయలో ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్ర స్థాయిలో నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.


మిట్స్‌లో నేడు మెగా ల్యాప్‌టాప్-టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో

కురబలకోట: మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఉదయం పది గంటల నుండి మెగా ల్యాప్ టాప్, టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో-25 నిర్వహిస్తున్నట్లు వీసీ యువరాజ్ తెలిపారు. ఈ గ్రాండ్ ఎగ్జిబిషన్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్రముఖ బ్రాండ్‌ల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ పరికరాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఫ్రీ బుకింగ్‌కు అవకాశం ఉందన్నారు.

అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిట



సిద్దవటం:పూజలందుకున్న శీతల గంగమ్మ అమ్మవారు



సుండుపల్లె: ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ తల్లి



పుల్లంపేట: పూజలు అందుకుంటున్న అమ్మవారు



చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ తల్లి



సంబేపల్లె: నల్లగంగమ్మతల్లి దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1, పార్వతీపురం గ్రామంలో శీతల గంగమ్మ అమ్మవారికి ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసినట్లు ఆలయ పూజారి రంగమ్మ తెలిపారు.

నాగారపమ్మ ఆలయంలో..

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లె గ్రామంలో బహుదానది పరివాహక ప్రాంత సమీపంలో వెలసిన నాగారపమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులలో భాగంగా బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తలనీలాలు సమర్పించుకున్నారు.

రెడ్డిపల్లిలో..

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

భక్తులతో పోటెత్తిన శ్రీదేవరరాయ నల్లగంగమ్మ తల్లి ఆలయం

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆలయాన్ని వేపాకులతో శుద్ధిచేసి పచ్చని తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

బెనిఫిషియర్ ప్లాంట్‌ను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామ సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : గోవిందంపల్లి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బెరైటీస్ బెనిఫిషియర్ ప్లాంటును ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం ఇటీవల కొద్దిరోజుల క్రితం సబ్ కలెక్టర్ ద్వారా గ్రామంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.

ఇందులో గ్రామస్తులు ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పుకోకపోవడంతో పనులు చేయలేదు. అయితే ఆదివారం రోడ్లు వేసి పనులు ప్రారంభించేందుకు సిద్ధం చేయడం గమనించి గ్రామస్తులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో బెనిఫిషియల్ ప్లాంట్‌తో గ్రామంలో కాలుష్యం పెరిగిపోయి ఇంకా ఇబ్బందులు పడతామని, ఇలాంటి ప్లాంట్లకు అనుమతి ఇవ్వకూడదని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్‌రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న దండు గోపి

రాజంపేట టౌన్ : చిత్తూరు జిల్లా దేవళంపేటలో రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన అగ్రవర్ణాల దురహంకారులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి దండు గోపి డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్ కీర్తిప్రతిష్టలను కొనియాడుతుంటే రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలను అవమానిస్తుండటం హేయమైన చర్య అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడమంటే భారత రాజ్యాంగానికి నిప్పు పెట్టడమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దళితులకే కాక దేశ ప్రజల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ విగ్రహాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

పీలేరురూరల్ :మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పి.టి.ఎం. శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే మదనపల్లెను జిల్లాగా ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే 16 నెలలు పూర్తవుతున్నా మదనపల్లెను జిల్లాగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

ఉన్నత విద్యను అందించి.. ఉత్తమ పౌరులను తీర్చిదిద్ది..!

- రేపు ప్రభుత్వ హైస్కూల్ 91వ ఆవిర్భావ దినోత్సవం
- స్వాతంత్య్రానికి పూర్వం ఏర్పాటైన పాఠశాల
- భారీగా తరలి రానున్న పూర్వ విద్యార్థులు



రాజంపేట ప్రభుత్వ హైస్కూల్

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తి చేసుకొని 91 సంవత్సరంలో అడుగిడటంతో మంగళవారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దివంగత పోలూరు చెంగయ్యనాయుడు కృషి ఫలితంగా

1935వ సంవత్సరం అక్టోబర్ 7వ తేదీ రాజంపేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటైంది. దీంతో ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటయ్యి 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎస్వీ యూనివర్శిటీ రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ పోలూరు మురళీ, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ నెట్టెం శ్రీరాములునాయుడు, ప్రస్తుత ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటుకు అప్పట్లో రాజంపేట ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు రూ.15వేలు, పోలూరు చెంగయ్యనాయుడు రూ.10వేలు, గుత్తా చిన్నవెంకటప్పనాయుడు రూ.5వేలు, తాంద్ర పరమనాయుడు రూ.3వేలు, పిఎస్.సుబ్బానాయుడు, పారా సుబ్బానాయుడులు వెయ్యి రూపాయిల చొప్పున విరాళం ఇచ్చారు. కేవలం 35 వేల రూపాయలతో దాదాపు 27 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి భవనాలను కూడా నిర్మించారు. అప్పటి నుంచి రాజంపేట ప్రాంత ప్రజలకు ప్రభుత్వ హైస్కూల్ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుకున్న అనేక మంది వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొంది ఉన్నారు. అలాగే ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అనేక మంది పెద్ద హోదాల్లో పనిచేస్తున్నారు. ఇప్పటికి రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రతి ఏడాది వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

తొలి హెడ్‌మాస్టర్ సీతారామయ్య..

1935వ సంవత్సరంలో రాజంపేటలో ఏర్పాటు అయిన ప్రభుత్వ హైస్కూల్‌కు తొలి హెచ్ఎంగా దివంగత పరమాత్మ సీతారామయ్య పనిచేశారు. సీతారామయ్య 1935వ సంవత్సరం నుంచి 1948వ సంవత్సరం వరకు దాదాపు 13 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించారు.

ఆకేపాటి చెంగల్‌రెడ్డి కృషితో ప్రహరీ..

అన్నమయ్య జిల్లాలో అతిపెద్ద విశాలమై క్రీడామైదానంతో కూడిన ప్రభుత్వ హైస్కూల్ రాజంపేటలోనే ఉంది. 1935వ సంవత్సరంలో ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటు అయినప్పటికి ప్రహరీ లేక పోవడంతో ఆ ప్రాంతంలోని వారు ప్రభుత్వ హైస్కూల్‌కు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకుంటుండేవారు. దీంతో ప్రిన్సిపల్‌గా ఉన్న వెంకటశేషయ్య స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని అప్పటి ఎమ్మెల్సీ ఆకేపాటి చెంగల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆకేపాటి చెంగల్‌రెడ్డి అప్పటి కలెక్టర్ చంద్రమౌళిని కలిసి ప్రభుత్వ హైస్కూల్‌కు ప్రహరీ మంజూరు చేయాలని కోరారు. దీంతో అప్పటి కలెక్టర్ ప్రహరీ నిర్మాణానికి రూ.20 వేలు మంజూరు చేశారు. ఆ నిధులతో వెంకటశేషయ్య దగ్గరుండి ప్రహరీ నిర్మాణ పనులను చేయించడంతో ప్రభుత్వ హైస్కూల్‌కు సంబంధించిన స్థల ఆక్రమణకు అడ్డుకట్టపడింది.

1969లో జూనియర్ కళాశాల

రాజంపేటకు 1969వ సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. అప్పటి నుంచి ప్రభుత్వ హైస్కూల్‌లోనే జూనియర్ కళాశాల నడిచేది. రాజంపేటకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైన సమయంలో ప్రభుత్వ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా పి.వెంకటశేషయ్య హెడ్‌మాస్టర్‌గా ఉండేవారు. ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలు ఒకే గొడుగుకిందకు రావడంతో హెచ్ఎంగా ఉన్న వెంకటశేషయ్య ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. జూనియర్ కళాశాలకు తొలి ప్రిన్సిపల్ వెంకటశేషయ్య కావడం విశేషం. అయితే 2005వ సంవత్సరంలో విభజన జరగడంతో ప్రస్తుతం ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలు వేర్వేరుగా నడుస్తున్నాయి.

మాటల్లో వర్ణించలేని అనుభూతి..



ప్రభుత్వ హైస్కూల్ 91వ ఆవిర్భావ దినోత్సవం జరుపుతుండటం చాలా ఆనందంగా ఉంది. రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌కు ఘనమైన చరిత్ర ఉంది. నేను ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుకోవడమే కాక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల ఒకే గొడుగు కింద ఉన్న సమయంలో ప్రిన్సిపల్‌గా పనిచేసే అవకాశం కలగడం, ఇప్పుడు ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొంటుండటం మాటల్లో వర్ణించలేని అనుభూతి కలుగుతుంది.

ఆకేపాటి రజనీకాంత్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, రాజంపేట

ఇకపై ప్రతి ఏడాది..



రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఆవిర్భావ దినోత్సవానికి ప్రముఖులు, పూర్వ విద్యార్థుల సహకారంతో వంద సంవత్సరాల వరకు ప్రతి ఏడాది నిర్వహించాలనుకుంటున్నాము. నేను రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుకొని ఇక్కడి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చరిత్రలో నిలిచిపోవాలన్నదే పూర్వ విద్యార్థుల కోరిక.

నెట్టెం శ్రీరాములునాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపల్, రాజంపేట

పూర్వ జన్మ సుకృతం



రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఆవిర్భావ దినోత్సవం జరిగే సమయంలో నేను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉండటం అలాగే మా ప్రాంగణంలో వేడుకలు జరుగుతుండటం నిజంగా తన పూర్వజన్మ సుకృతం. ఇలాంటి అరుదైన అవకాశం రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

ఎస్వీ రమణరాజు, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట

జయరామిరెడ్డికి ఆకేపాటి నివాళులు



మేకపాటి జయరాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి సుబ్బారెడ్డి తండ్రి జయరాంరెడ్డి సంవత్సరీకం కార్యక్రమానికి ఆదివారం విచ్చేసిన వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి జయరామిరెడ్డి చిత్రపటాని పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట మండల కన్వీనర్ శివారెడ్డి, వల్లీచాన్, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె సుబ్బరామిరెడ్డి, రాజంపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కేవీ సుబ్బయ్య, ఎంపీటీసీ శివయ్య, మాజీ సర్పంచులు, మరికొందరు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి అవార్డు

మదనపల్లె సిటీ: వయో వృద్ధుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సీనియర్ సిటిజెన్ అవార్డును ప్రకటించింది. గుంటూరులో ఆదివారం జరిగిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. మునిగోపాలకృష్ణను మదనపల్లె సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. వయో వృద్ధుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

సుండుపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగార్జునరెడ్డి కుమారుడు నాగసాహిత్‌రెడ్డి వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆదివారం కొండలతూర్పు గ్రామంలోని వారి స్వగృహంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, ఆరంరెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, రెహమాన్‌ఖాన్ పాల్గొన్నారు.